క్లుప్తంగా

ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సహకరించండి

పొన్నూరు సీఐ భాస్కర్



పొన్నూరు: ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెలువడనున్న నేపథ్యంలో ప్రశాంతమైన వాతావరణంలో ప్రక్రియ కొనసాగేలా ప్రజలు సహకరించాలని పట్టణ సీఐ భాస్కర్ తెలిపారు. పట్టణంలో బుధవారం ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు నిర్వహించి స్థానికులతో మాట్లాడారు. ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో పట్టణంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా పోలీసు బలగాలతో భద్రత చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రశాంతంగా జరగాలని ఎలాంటి అల్లర్లకు తావివ్వరాదని అన్నారు. పోలింగ్ సజావుగా జరిగిందని, లెక్కింపు ప్రక్రియ కూడా పూర్తయ్యేవరకు ప్రజలు సహకరించాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా సహించేది లేదని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు



గుంటూరు రూరల్: రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తులను తప్పించే క్రమంలో కారు డివైడర్‌ను ఢీకొనడంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జయ్యింది. కారులోని ఇరువురికి స్వల్ప గాయాలు అయ్యాయి. నల్లపాడు సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు నుంచి జేకేసీ కళాశాలకు వెళ్లే రోడ్డులో వేగంగా వెళుతున్న కారు శివారులోని బార్ సమీపంలో పాదచారులను తప్పించే క్రమంలో డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. కారులోని ఇరువురికి స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఖాతాదారులకు మెరుగైన సౌకర్యాలు



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరులోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ విద్యానగర్ బ్రాంచ్ అన్ని విధాలుగా కస్టమర్లకు సత్వర సేవలు అందించడంలో మొదటి స్థానం సాధించిందని, దానికి ప్రత్యేకంగా సోమవారం గుంటూరులో జరిగిన బ్యాంకు వార్షిక సమావేశంలో అన్ని విభాగాల్లో కలిపి మొత్తం 10 అవార్డులు, బహుమతులు, మొమెంటోలు గెలుచుకుందని బ్రాంచ్ సీనియర్ మేనేజర్ టి.కిషోర్‌రెడ్డి వివరించారు. వార్షిక సమావేశం వివరాలను కిషోర్‌రెడ్డి బుధవారం మీడియాకు వివరించారు. సీజీజీబీ విద్యానగర్ బ్రాంచి మొత్తం వ్యాపారం రూ.175 కోట్లు దాటిందని, రూ.200 కోట్లు దిశగా పరుగులు తీస్తోందని వెల్లడించారు. గత ఏడాది(2023–24) బ్రాంచ్ బిజినెస్ రూ.40 కోట్ల మేర వృద్ధిని సాధించిందని తెలిపారు. డిపాజిట్లపై అత్యధిక వడ్డీని చెల్లిస్తూ కస్టమర్లకు వెన్నుదన్నుగా నిలిచిందని వివరించారు. ఇన్ని అవార్డులు ఒకే సంవత్సరంలో రావడం ఈ ప్రాంత ప్రజలకు బ్యాంకుపై ఉన్న నిబద్ధతకు తార్కాణం అని కొనియాడారు. వార్షిక సమావేశంలో బ్యాంకు మేనేజర్ టి.కిషోర్‌రెడ్డికి పలు విభాగాల్లో 10 అవార్డులు అందజేసి, దుశ్శాలువాతో సత్కరించి, మోమెంటోను అందజేశారు.

తొలితరం దళిత ఉద్యమకారుడు భాగ్యరెడ్డి వర్మ



నెహ్రూనగర్: తరతరాలుగా అంటరానితనానికి అవమానాలు అణిచివేతకు గురైన దళితుల తలరాతలు మార్చిన తొలి ఉద్యమ కారుడు భాగ్యరెడ్డి వర్మ అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పగల ప్రకాష్ పేర్కొన్నారు. ఉమ్మడి మద్రాస్ ఆంధ్ర రాష్ట్రాల్లో దళితుల అణిచివేతకు, అవమానాలకు వ్యతిరేకంగా సామాజిక ఉద్యమాన్ని ఉధృతం చేసిన గొప్ప మేధావి భాగ్యరెడ్డి వర్మ అని కొనియాడారు. బుధవారం అరండల్‌పేటలోని భీమ్ భారత్ కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ 136వ జయంతి కార్యక్రమం జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బాలికలకు పాఠశాలలను ఏర్పాటు చేశారని, దేవదాసి, బసవి, జోగిని వ్యవస్థ లాంటి దురాచారాలను రూపుమాపేందుకు ఉద్యమించారన్నారు. నేటి యువత మహనీయుల ఆశయాలను ఆలోచనలను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలి

- ఆర్వో లక్ష్మీకుమారి
- ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన సదస్సు
- ఏజెంట్లుగా చేరగోరేవారు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో లక్ష్మీకుమారి

పొన్నూరు: ఎన్నికల ఫలితాల నేపథ్యంలో కౌంటింగ్ హాల్‌లో ఏజెంట్ల ప్రవేశం కోసం ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకుంటే వారికి ఐడీ కార్డు మంజూరు చేయనున్నట్లు ఆర్వో లక్ష్మీకుమారి తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రంలో ఏజెంట్లు సెల్‌ఫోన్లు తీసుకు వెళ్లకూడదని తెలిపారు. నిబంధనల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియకు సహకరించని ఏజెంట్లను బయటకు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 3వ తేదీన పొన్నూరు తహసీల్దార్ కార్యాలయంలో భద్రపరిచిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను జూన్ 3న ఏఎన్‌యూలోని రూమ్ నెంబరు 205కు ఏజెంట్ల సమక్షంలో తరలించనున్నట్లు వెల్లడించారు. 4న ఉదయం 8 గంటల లోపు వచ్చే పోస్టల్ బ్యాలెట్‌లను పోస్టల్ శాఖ నుంచి స్వీకరించనున్నట్లు చెప్పారు. ఈవీయంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్ నెంబరు 204, పోస్టల్ బ్యాలెట్ భద్రపరచిన 205 గదులను 4న ఉదయం 7 గంటలకు అభ్యర్థులు, ఏజెంట్లు, పరిశీలకుల సమక్షంలో తెరవనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఎన్నికల నియమావళిని అనుసరించి కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు. సమావేశంలో ఏఆర్వోలు, ఏజెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వీవీఐటీలో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం



నంబూరు వీవీఐటీలో ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో కమాండింగ్ అధికారి సుదర్శన్, ఎన్‌సీసీ క్యాడెట్లు

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో 10ఏ బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ గుంటూరు శిక్షణ శిబిరం ప్రారంభించినట్లు బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ ఎస్ఎఎస్ సుదర్శన్ తెలిపారు. పెదకాకాని మండలంలోని నంబూరు వీవీఐటీ కళాశాలలో బుధవారం గ్రూప్ 7వ వార్షిక శిబిరం ప్రారంభోత్సవం సందర్భంగా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్ఏఎస్ సుదర్శన్ మాట్లాడుతూ.. 10 రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో 10ఏ బెటాలియన్ గుంటూరు గ్రూప్ లోని వివిధ విద్యా సంస్థలకు చెందిన 632 బాలికలు పాల్గొన్నారన్నారు. విద్యార్థుల్లో సైనిక సూత్రాలు, క్రమశిక్షణ, నాయకత్వం, నైపుణ్యాల పెరుగుదల లక్ష్యంగా ఈ శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్‌సీసీలో శిక్షణ పొందే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, శిక్షణలో నేర్చుకునే ప్రతి అంశం క్యాడెట్ల ఉన్నతికి తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీవీఐటీ ఎన్‌సీసీ అధికారి డాక్టర్ ఏ శ్రీవాణి, గుంటూరు ఎన్‌సీసీ బెటాలియన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రసవత్తరంగా నాటిక పోటీలు



వరగాని(కాకుమాను): పెదనందిపాడు మండలంలోని వరగాని అంకమ్మ గుడి ఆవరణలో లావు వెంకటేశ్వర్లు, కల్లూరి నాగేశ్వరరావు కళా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల 8వ ఆహ్వాన నాటిక పోటీలు బుధవారం రెండో రోజు రసవత్తరంగా సాగాయి. రెండో రోజు రసఝరి పొన్నూరు వారి కాపలా, సద్గురు కళానిలయం గుంటూరు వారి కమనీయం, పండు క్రియేషన్స్ కొప్పోలు వారి పక్కింటి మొగుడు నాటికలను నిర్వహించారు. రెండో రోజు నాటిక పోటీలను ప్రముఖ వైద్యాధికారిణి డాక్టర్ కక్కెర ప్రజ్ఞశ్రీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జరిగే సంఘటనలను ప్రజలకు పూర్తి స్థాయిలో అర్థమయ్యే విధంగా వివరించేందుకు నాటికలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ప్రతి ఒక్కరు కళాకారులను గౌరవించడంతో పాటు వారిని ప్రోత్సహించాలని అప్పుడే కళారంగం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, నాటిక ప్రియులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం తనిఖీ



గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని పరిశీలిస్తున్న సుబ్బరత్నమ్మ

గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్‌గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయాన్ని బుధవారం జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు గ్రంథాలయాల్లో జూన్ 7వ తేదీ వరకు జరగనున్న ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరో తరగతి నుంచి టెన్త్ వరకు చదువుతున్న విద్యార్థులకు కథలు చదవడం, చెప్పడం, సొంతంగా రాయడం, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, పేపర్ క్రాఫ్ట్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తూ, ప్రతి వారం పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. గ్రంథాలయాధికారి బి.శకుంతల, సిబ్బంది పి.కోటేశ్వరి, సీహెచ్ లక్ష్మి, పాఠకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం గ్రంథాలయాధికారి ఎన్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులతో కథలు, కథానికలు చెప్పించారు. కథలు వినడంతో పాటు ఆకట్టుకునే విధంగా చెప్పే అలవాటు చేసుకోవడం ద్వారా విద్యార్థులు తమలోని సృజనాత్మక నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

జీవ వైవిధ్య రక్షణకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అవగాహన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: జీవవైవిధ్యాన్ని జాతీయ సంపదగా భావించాలని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పర్యావరణ ప్రచారకులు వి.సత్యనారాయణ మాట్లాడుతూ మానవునికి జీవ వైవిధ్యానికి అవినాభావ సంబంధం ఉందన్నారు. పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ వలన సహజవనరులపై తీవ్ర ఒత్తిడి పెరిగి భూగోళం కాలుష్యానికి గురవుతోందన్నారు. మానవుడు అభివృద్ధి పేరుతో ప్రకృతిని అనేక విధాలుగా ధ్వంసం చేస్తున్నారన్నారు. ఫలితంగా అసంఖ్యాక జంతు, వృక్ష జాతులు అంతరించిపోతున్నాయన్నారు. విశ్రాంత జంతుశాస్త్ర శాఖాధిపతి డాక్టర్ ఆర్.రామచంద్రరావు మాట్లాడుతూ 21వ శతాబ్దంలో పర్యావరణ విధ్వంసం, జీవజాతుల నష్టం పట్ల ప్రపంచ దేశాలన్నీ ఆందోళన వెలిబుచ్చాయన్నారు. పటిష్టమైన చట్టాలతోనే జీవవైవిధ్య మనుగడ సాధ్యమవుతోందన్నారు. విద్యావేత్త ముప్పాళ్ల ప్రసాదరావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వైభవం.. బ్రహ్మోత్సవం



స్వామివార్ల శాంతికల్యాణ మహోత్సవం



పురవీధుల్లో స్వామివారి రథోత్సవం

నగర వీధుల్లో గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి రథోత్సవం

నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 13న మొదలైన బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామివార్ల శాంతి కల్యాణ మహోత్సవం చేపట్టారు. అనంతరం నందివాహనంపై స్వామివారి నగరోత్సవం జరగ్గా, భక్తులు అధికసంఖ్యలో హాజరై, స్వామి వార్లను దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. సాయంత్రం వేళ స్వామివారి రథోత్సవాన్ని కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించగా, ఇరువైపులా భక్తులు హాజరై తాళ్ల సహాయంతో లాగుతూ నగర పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త పన్నాల వెంకట బుచ్చిరామశాస్త్రి, 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, ఈఓ పగడాల శివకోటేశ్వరరావు, యఱ్ఱగోపుల జయదీప్, అర్చకులు చిన్నా, చందు, నరసయ్య, ఫణిశర్మ పాల్గొన్నారు.

24 నుంచి పేరేచర్ల - ఫిరంగిపురం రైల్వే గేటు మూసివేత

లక్ష్మీపురం: పేరేచర్ల – ఫిరంగిపురం మధ్య ఉన్న రైల్వే గేటును ఈనెల 24వ తేదీ ఉదయం 7గంటల నుంచి 26వ తేదీ రాత్రి 7 గంటల వరకు మూసివేస్తున్నట్లు రైల్వే సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ బుధవారం వెల్లడించారు. లెవల్ క్రాసింగ్‌లో రైలు పట్టాలపై అత్యవసర మరమ్మతులు చేస్తున్నందున ఈ గేటు మూసివేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు సాక్షి భావన్నారాయణ స్వామి రథోత్సవం



విద్యుత్ అలంకరణలో ఆలయం

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత సాక్షి భావన్నారాయణ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం స్వామికి పంచామృత స్నపన, తిరువంజనోత్సవం, రాత్రి గజవాహనంపై స్వామికి ఎదురుకోలోత్సవం, అనంతరం స్వామి వారి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. గురువారం స్వామివారి దివ్య రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మండే పూడి పానకాలరావు తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమయ్యే రథోత్సవంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పుస్తకాలు విజ్ఞాన బాంఢాగారాలు





పెదకాకాని గ్రంథాలయంలో జరిగిన సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు

పెదకాకాని: విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని పుస్తకాలు విజ్ఞాన బాంఢాగారాల వంటివని గ్రంథాలయాధికారి వేముల విజయ్ కుమార్ అన్నారు. పెదకాకాని లూథర్‌గిరి కాలనీ గ్రంథాలయంలో ఈ నెల 15 నుంచి ప్రారంభమైన వేసవి శిక్షణా తరగతులు జూన్ 7 వరకు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన శిక్షణా శిబిరంలో గ్రంథాలయాధికారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు కథలు చెప్పటం, వారిచే కథలు చెప్పిచటం జరిగిందన్నారు. ఆటలు ఆడించడంతో పాటు పరుగు పందెం పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. పుస్తక సమీక్ష, స్టోరీ టెల్లింగ్ అంశాలపై తర్ఫీదునివ్వటం జరిగిందన్నారు. విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి జూన్ 7న బహుమతులు ఇవ్వటం జరుగుతుందన్నారు.

విద్యార్థులకు ఉపాధి కల్పనే లక్ష్యం



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పన లక్ష్యంగా తమ కళాశాలలో విద్యా బోధన ఉంటుందని ప్రభుత్వ మైనారిటీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ రాజశేఖరరావు తెలిపారు. బుధవారం నల్లపాడు గ్రామంలోని కళాశాలలో జరిగిన ఉద్యోగ విజయోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..ఇటీవల తమ కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో కళాశాలకు చెందిన విద్యార్థులు 12 మంది జయలక్ష్మి ఆటోమోటివ్స్‌కు, ముగ్గురు విద్యార్థులు సిండిక్ కన్సల్టింగ్ ఇంజినీర్స్ సంస్థకు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను సాయినాథ్, అప్సర్ తదితరులు అభినందించారు.

ఓట్ల లెక్కింపు విధివిధానాలపై సమగ్ర అధ్యయనం

నగర కమిషనర్, తూర్పు ఆర్‌ఓ కీర్తి చేకూరి



అధికారులతో సమావేశమైన నగర కమిషనర్, తూర్పు ఆర్‌ఓ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు విధి విధానాలను కౌంటింగ్ సిబ్బందితో పాటు అధికారులు కూడా సమగ్రంగా అధ్యయనం చేయాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 4న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతుందని, విధులు కేటాయించబడిన అధికారులు ఓట్ల లెక్కింపుపై ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను సమగ్రంగా అధ్యయనం చేయాలన్నారు. ఓట్ల లెక్కింపులో తొలుత పోస్టల్ బ్యాలెట్స్, సర్వీస్ ఓట్లు లెక్కించడం జరుగుతుందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌లో వ్యాలిడ్, ఇన్ వ్యాలిడ్ ఓట్లను ఎలా వేరు చేయాలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు సంబంధించిన సూచనలను ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు తప్పనిసరిగా చదివి అర్థం చేసుకోవాలన్నారు.

ఐడీ కార్డులు తప్పక ధరించాలి..

కౌంటింగ్ విధులకు ఎంపికైన వారు తప్పనిసరిగా ఐడీ కార్డ్ లు ధరించాలని, కౌంటింగ్ కేంద్రంలోనికి సెల్‌ఫోన్ అనుమతి లేనందున సెల్‌ఫోన్ డిపాజిట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డీఈఈని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రంలో తగిన టేబుల్స్, ఇంటర్నెట్ కనెక్షన్, కంప్యూటర్లు, ఆపరేటర్లు ఉండేలా పర్యవేక్షణ చేయాలని ఈఈనిని, విధుల్లో ఉండే అధికారులు, సిబ్బందికి టిఫిన్, భోజన సదుపాయాలు కల్పించాలని డీఈఈని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి ఈవిఎంలు తీసుకొచ్చేందుకు, అధికారులు, లెక్కింపు సిబ్బంది, అభ్యర్థులు, ఏజంట్లు లెక్కింపు కేంద్రంలోనికి వచ్చేందుకు వేరువేరుగా మార్గాలు ఉండాలని, అవసరమైతే బారికేడింగ్ చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ కు అవసరమైన మెటీరియల్‌ను చెక్ లిస్ట్ మేరకు సిద్ధం చేయాలని మేనేజర్‌ని ఆదేశించారు. సమావేశంలో ఏఆర్‌ఓలు సునీల్ కుమార్, భీమరాజు, ప్రదీప్ కుమార్, వెంకటలక్ష్మీ, డిప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఈఈలు సుందర్‌రామిరెడ్డి, శ్రీనివాస్, డిఈఈ రమేష్ బాబు, మేనేజర్ ఎస్.ఎస్.ప్రసాద్, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

కెమిస్ట్రీలో నీలాంబరంకు డాక్టరేట్



నెహ్రూ నగర్: ప్రముఖ సీఎస్ఐఆర్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ హైదరాబాద్ పరిశోధనా సంస్థలో పాలిమర్ కెమిస్ట్రీలో టీజేపీఎస్ కళాశాల విద్యార్థి పునుగుపాటి నీలాంబరం పీహెచ్‌డీ పట్టా పొందారు. పర్యావరణ సహిత ఏమల్షన్స్ మీద పరిశోధన చేసి థీసిస్ సమర్పించినందుకు పీహెచ్‌డీ పట్టా పొందినట్లు నీలాంబరం చెప్పారు. డాక్టర్ రామానుజ్ నారాయణ్, అరిందమ్ చక్రబర్తిల పర్యవేక్షణలో పరిశోధన చేసి థీసిస్ సమర్పించడం జరిగిందన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తత అవసరం

కొరిటెపాడు(గుంటూరు): భీకర గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ట్రాన్స్‌కో అధికారులు, వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. పొలాల్లో వ్యవసాయ పనులకు వెళ్లిన సమయంలో ఆకస్మాత్తుగా వర్షం కురిసిన సమయంలో రైతులు, కూలీలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. వర్షం కురిసే సమయంలో పిడుగులు పడే అవకాశం ఉందని, ఎటువంటి పరిస్థితుల్లో చెట్ల కిందకు వెళ్లరాదన్నారు. పెనుగాలులతో కూడిన వర్షం కురిసే సమయంలో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావద్దని సూచించారు. రాక పోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు చాలా మంది వర్షం కురిస్తే చెట్ల కిందకు వెళ్తుంటారని, అలా చేయడం చాలా ప్రమాదకరమన్నారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి..

చిన్న పాటి వర్షం కురవడం ప్రారంభం కాగానే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి. ఉరుములు, మెరుపులు వస్తున్న సమయంలో చెట్ల కింద, ఎత్తయిన ప్రదేశాలకింద ఉండకూడదని సూచించారు. ఇంట్లో ఉన్న కరెంట్ స్విచ్ బోర్డులు నుంచి ప్లగ్‌లు తీసివేయాలన్నారు. టీవీలు, సెల్ ఫోన్‌లు చూడొద్దన్నారు. విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఉండరాదని వారు సూచించారు.

ఘనంగా నృసింహస్వామి జయంత్యుత్సవాలు



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారంలోని కొలువైన లక్ష్మీ నృసింహస్వామి వారి దేవస్థాన ఆవరణలో బుధవారం స్వామి వారి తిరునక్షత్రం (జయంత్యుత్సవాలు) భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేయగా, సాయంత్రం కల్యాణం అత్యంత వైభవోపేతంగా జరిగింది. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు నంద్యాల శ్రీనివాస ఆచార్యులు, ఈఓ మాధవీదేవి తదితరులు పాల్గొన్నారు.